సాక్షి కర్నూలు

మంగళవారం। 8। జూలై। 2025



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది క్షేత్రంలో భక్తుల సందడి కొనసాగింది. తొలిఏకాదశి ఉపవాస దీక్ష తీసుకున్న భక్తులు సోమవారం ఉదయం మహానందీశ్వరుడిని దర్శించుకుని వ్రతాన్ని విరమించారు.



15 నుంచి కేసీకి నీటి విడుదల

కేసీ కెనాల్‌కు ఈనెల 15 నుంచి సాగునీటిని విడుదల చేయనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఐఏబీ సమావేశం జరిగింది. 8లో▸



కుంటుపడిన గిరిజన విద్య!

జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పాఠశాలలు పునః ప్రారంభమై రెండు నెలలైనా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేదు. 8లో▸

న్యూస్‌రీల్

సుంకేసులకు కొనసాగుతున్న వరద

కర్నూలు సిటీ: కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర జలాశయం నుంచి దిగువకు భారీగా నీరు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీ(కోట్ల విజయభాస్కర్ బ్యారేజీ)కి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. సోమవారం ఉదయం 6 గంటలకు 62,500 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సాయంత్రం 6 గంటలకు 57 వేల క్యుసెక్కులకు చేరుకుంది. దీంతో బ్యారేజీ నుంచి ఉదయం 17 గేట్ల ద్వారా 66,589 క్యుసెక్కులు.. సాయంత్రం 59,310 క్యుసెక్కులను 15 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

ఏడుగురు డిప్యూటీ ఎంపీడీఓలకు పోస్టింగ్‌లు

కర్నూలు(అర్బన్): ఇటీవల పదోన్నతి పొందిన ఏడుగురు డిప్యూటీ ఎంపీడీఓలకు పోస్టింగ్ ఇచ్చినట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతి పొందిన జేమ్స్ కృపవరంను కర్నూలు, ఎ.నాగరాజును చిప్పగిరి, కె.నాగరాజును హాలహర్వి, ఎ.విజయలక్ష్మిని మద్దికెర, జి.మహేశ్వరిని సి.బెళగల్, పి.గోపాలను దేవనకొండ, జీఎంఏ కిషోర్ కుమార్‌ను కోడుమూరు మండలానికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

పీజీ, బీటెక్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ వెంకట బసవరావు, చిత్రంలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీటెక్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పీజీ నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు 489 మందికిగాను 415 మంది విద్యార్థులు హాజరుకాగా బీటెక్ 4, 6 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, 3, 5, 7 సప్లిమెంటరీ పరీక్షలకు 243 మందికిగాను 241 మంది విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉడతా వెంకట బసవరావు, రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్‌కుమార్ నాయుడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

9న గురుకులాల్లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాసంస్థల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 9న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 5వ తరగతిలో బాలురకు రెండు సీట్లు మాత్రమే ఉన్నాయని, అవి కూడా ఎస్టీ, బీసీలకు మాత్రమేనన్నారు. ఇంటర్మీడియెట్‌లో బాలురకు ఎంపీసీలో 6, బైపీసీలో 5, సీఈసీలో 36 సీట్లు భర్తీ చేయాల్సి ఉందన్నారు. 5వ తరగతిలో బాలికలకు 70, ఇంటర్మీడియెట్‌లో బాలికలకు ఎంపీసీలో 70, బైపీసీలో 26 సీట్లను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఈ కౌన్సిలింగ్‌కు గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన బాలికలు మాత్రమే హాజరుకావాలన్నారు. 9న ఉదయం 10 గంటలకు 5వ తరగతి సీట్ల భర్తీకి (బాలురు, బాలికలు) దిన్నెదేవరపాడులోని అంబేద్కర్ బాలికల గురుకులంలో హాజరుకావాలన్నారు.

సంకల్పం సస్యశ్యామలం.. చిరునవ్వుల సంక్షేమం

జనం మెచ్చిన మహానేత వైఎస్సార్

- వ్యవసాయాన్ని పండుగ చేసిన రైతుబిడ్డ
- హంద్రీనీవా జలాలతో కరువు సీమ పులకింత
- భూపంపిణీతో రైతులైన వ్యవసాయ కూలీలు
- చరిత్రలో నిలిచిపోయిన రైతు రుణమాఫీ



వైఎస్సార్.. ఈ పేరు వినిపిస్తే చాలు ప్రతి హృదయం పులకిస్తోంది. ప్రగతి స్వాప్నికుడు.. సంక్షేమ రథసారథి.. ప్రజలే ప్రాణంగా సాగించిన ప్రయాణంలో దూరమై 16 ఏళ్లు గడిచినా ప్రతి మదిలో రాజన్న స్థానం పదిలం. ఆయన పాలనలో ప్రతి ఇంటి ముంగిటా అభివృద్ధి వెలుగులే. ప్రతి పేద గుండెలో ఆ నిండైన రూపమే. బీడు బారిన నేల తల్లికి జల సిరులందించిన అపరభగీరథుడిలా.. దగాపడిన బడుగు జీవికి అభయహస్తమందించి.. లయ తప్పిన పేద గుండెకు ఊపిరులూదిన దైవంలా.. ఆసరా లేని వృద్ధాప్యానికి పెద్ద కొడుకుగా భరోసానిచ్చి.. ఆరుగాలం కష్టించినా ఉరితాడే దిక్కయిన పేద రైతు కష్టాలు ఒక్క సంతకంతో మాఫీ చేసిన 'మహా నేత'.. తెలుగుదనానికి నిలువెత్తు రూపమే వైఎస్సార్. అప్పట్లో అభివృద్ధి ఫలాలు పొందిన ప్రతి గుండె ఆ మహానేతను మనసారా స్మరిస్తోంది. నేడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

– కర్నూలు(అగ్రికల్చర్)/కృష్ణగిరి/నంద్యాల

రైతుల పాలిట వరం.. ఉచిత విద్యుత్

2004 సంవత్సరానికి ముందు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. నాటి పాలకులే వ్యవసాయం దండగని ప్రకటించడంతో రైతులకు చేయూత కరువైంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఉమ్మడి జిల్లాలో ఉచిత విద్యుత్ కనెక్షన్‌లు 1.15 లక్షలు ఉండగా.. ఆయన మరణించే నాటికి 1,56,790 కనెక్షన్‌లకు చేరుకున్నాయి. అప్పట్లోనే ఉచిత విద్యుత్ ద్వారా రైతులకు ఏడాదికి రూ.50 వేల వరకు ప్రయోజనం లభించింది. మొట్ట మొదట ఇటు రైతులు, అటు పొదుపు మహిళలకు పావల వడ్డీకే రుణాలు ఇచ్చే విధానాన్ని తెచ్చారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో 4.50 లక్షల మంది రైతులు, 3.25 లక్షల మంది పొదుపు మహిళలకు లబ్ధి చేకూరింది.

వ్యవసాయ కూలీలు రైతులయ్యారు

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన భూపంపిణీ కార్యక్రమం వల్ల కూలీలు రైతులయ్యారు. వైఎస్ఆర్ హయాంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 1.20 లక్షల మంది రైతులకు 1.35 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారు. పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లో ఉపాధిహామీ పథకం కింద డ్రైల్యాండ్ హార్టికల్చర్ పేరుతో పండ్లతోటల పెంపకాన్ని చేపట్టి వారికి శాశ్వత ఆదాయ వనరులను సృష్టించారు. 2007లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌తో కలసి ఓర్వకల్ మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. ఉపాధి నిధులతో 2007–08, 2008–09 సంవత్సరాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద 9వేల ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేశారు. నాడు వ్యవసాయ కూలీలుగా ఉన్న వారు భూపంపిణీ కార్యక్రమంతో రైతులుగా మారారు. ఉపాధి నిధులతో ఈ భూముల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసుకున్నారు.

రూ.15వేల కోట్ల రుణమాఫీ

వైఎస్సార్ హయాంలో విజయవంతంగా రుణమాఫీ చేయడం విశేషం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయించారు. ఉమ్మడి జిల్లాలో 2.75 లక్షల మంది రైతులకు సంబంధించి రూ.15వేల కోట్లు మాఫీ అయ్యాయి. సక్రమంగా రుణాలు చెల్లించడం వల్ల మాఫీ వర్తించని రైతులకు ప్రోత్సాహకాల కింద రూ.5వేల ప్రకారం చెల్లించారు.

- ఇందిరమ్మ ఇళ్ల పేరుతో హౌసింగ్‌లో సరికొత్త విప్లవం తెచ్చారు. వైఎస్సార్ హయాంలో నాలుగు దశల్లో ఉమ్మడి జిల్లాలో 3.25 లక్షల ఇళ్లు నిర్మించారు. వైఎస్సార్ హయాంలోనే కొత్త ఊళ్లు ఏర్పడ్డాయి.

మాటలకందని అభిమానం..



తల్లిదండ్రులతో శబరీష్ (ఫైల్)

నంద్యాల పట్టణం పప్పుల బట్టి ప్రాంతంలోని నామలయ్య బడి దగ్గర వీడియో గేమ్స్ షాప్ యజమాని పేరు కృష్ణమూర్తి. భార్య పుష్పలత దేవి గృహిణి. వీరికి 2006లో కొడుకు శబరీష్ పుట్టాడు. ఏడాదిన్నర తర్వాత ఆ బాలుడికి సైగలు చేసినా స్పందించకపోవడం, మాటలు రాకపోవడంతో వైద్యుడిని సంప్రదించి, పరీక్షలు చేయించారు. పుట్టుకతో మూగ, చెవిటి వాడిగా తేలింది. దీంతో కృష్ణమూర్తి దంపతులు కృంగిపోయారు. చిన్న వయస్సులోనే సర్జరీ చేస్తే మాటలు, వినికిడి శక్తి వస్తుందని స్నేహితులు సలహానివ్వడంతో ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని 2009 ఫిబ్రవరిలో గుంటూరులోని కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారు. శబరీష్‌కు అదృష్టవశాత్తూ ఆరోగ్యశ్రీ పథకం కింద కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేయడానికి రూ.6.50 లక్షలు మంజూరయ్యాయి. దీంతో సర్జరీ చేయడంతో వినికిడి, మాటలు వచ్చాయి. తమ కుమారుడు శబరీష్‌కు బంగారు భవిష్యత్తునిచ్చిన మహానేత వైఎస్‌ను వారు దైవంలా భావిస్తున్నారు. కృష్ణమూర్తి తనషాపులో దేవుళ్ల చిత్ర పటాల మధ్య మహానేత చిత్రాన్ని పెట్టి పూజిస్తున్నారు.

జలయజ్ఞంతో మారిన సాగు ముఖచిత్రం

తొగర్చేడు సమీపంలో పరుగులు తీస్తున్న హంద్రీనీవా కాలువ (ఫైల్)




- నిత్యం కరువుతో అల్లాడుతున్న పత్తికొండ నియోజకవర్గంలో హంద్రీ నీవా కాలువ ఏర్పాటుతో కృష్ణాజలాలను పారించి సస్యశామలం చేశారు.
- కృష్ణగిరి, పందికోన రిజర్వాయర్లను ఏర్పాటు చేసి దాదాపుగా 80వేల ఎకరాలకు సాగు నీరు అందించే దిశగా చర్యలు చేపట్టారు.
- దేవనకొండ, తుగ్గలి, కృష్ణగిరి, డోన్ మండలంలోని 50 గ్రామాలకు, డోన్‌పట్టణానికి గాజుల దిన్నె ప్రాజెక్టు ద్వారా రూ.55కోట్లతో తాగు నీటిని అందించారు.
- హంద్రీనీవాలో భాగంగా వెల్దుర్తి మండలం మల్లెపల్లె వద్ద ఎత్తిపోతల పథకం, కృష్ణగిరి మండలంలో కృష్ణగిరి, కంబాలపాడు, ఆలంకొండ ఎత్తిపోతల పథకాలతోపాటు కృష్ణగిరి సమీపంలో 0.016 టీఎంసీలతో రిజర్వాయర్ నిర్మించి ఏడు గ్రామాల్లోని 5,100 ఎకరాలకు సాగునీటిని అందించారు.
- పత్తికొండ మండలంలోని పందికోన వద్ద ఒకటిన్నర టీఎంసీతో 60వేల ఎకరాలకు సాగునీరు పారించారు.
- లక్కసాగరం వద్ద, దేవనకొండ మండలం గుండ్లకొండ ఎత్తిపోతల పథకం సమీపంలో చానల్ కాలువలు ఏర్పాటు చేసి వీటి ద్వారా మరో 5,100 ఎకరాలను సస్యశ్యామలం చేశారు.

మెట్టకు ప్రాణం పోసిన అపర భగీరథుడు



ఆత్మకూరు: వర్షాధార పంటలు పండే మెట్ట భూములకు మహానేత వైఎస్సార్ ప్రాణం పోసి అపర భగీరథుడుగా మారారు. ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఒకే సారి ఐదు ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి మెట్ట భూములను ఆయకట్టుగా మార్చారు. జలయజ్ఞంలో భాగంగా సిద్దాపురం, చెలిమెళ్ల, లింగాల, శివపురం, ఇస్కాల ఎత్తిపోతల పథకాలతో దాదాపు 30 వేల ఎకరాలకు పైగా నీరందించారు. 2006లో ఈ పథకాలకు నిధులు మంజూరు చేయడంతో పథకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం రైతులు రెండు పంటలు పండిస్తూ నేటికీ మహానేత మేలును తలుచుకుంటున్నారు.

'జల'హో రాజన్న!



అవుకు రిజర్వాయర్

కోవెలకుంట్ల: రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేయాలన్న మహానేత సంకల్పం జలయజ్ఞంతో సాకారమైంది. రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న అవుకు రిజర్వాయర్‌ను రూ. 70 కోట్లతో నాలుగు టీఎంసీల సామర్థ్యానికి పెంచేందుకు 2005 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి అవుకు రిజర్వాయర్‌లోకి నీరు చేరేందుకు 30వ ప్యాకేజీ కింద రూ. 401కోట్లతో 12కిలోమీటర్ల మేర రెండు సొరంగ మార్గాలను ఏర్పాటు చేసి వీటి ద్వారా 20 వేల క్యూసెక్కుల వరద జలాలను రిజర్వాయర్‌లో నింపాల్సి ఉంది. 2010 నాటికే ఒక సొరంగం గుండా వైఎస్సార్ జిల్లా గండికోటకు నీటిని విడుదల చేయాలి. వైఎస్సార్ మరణం తర్వాత కిరణ్ సర్కార్, 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం జలయజ్ఞ పనులను నిర్లక్ష్యం చేయడంతో పది శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 2019లో అధికారంలో వచ్చిన జగన్ సర్కార్ ఆ పనులను పూర్తి చేసి ఒక్కో సొరంగం ద్వారా పదివేల క్యూసెక్కుల నీటి విడుదలకు మార్గం సుగమం చేసింది. జిల్లాతోపాటు వైఎస్సార్, చిత్తూరు జిల్లాల ప్రజలకు శాశ్వితంగా తాగునీరు, సాగునీటి కష్టాలను తీర్చాలన్న ఉద్దేశంలో అవుకు రిజర్వాయర్‌కు అనుసంధానంగా గత ప్రభుత్వం రూ. 300 కోట్లతో 5.9 కిమీ పొడవునా మూడో సొరంగం నిర్మాణం చేపట్టింది.

నా ఎదుగుదల వైఎస్సార్ పుణ్యమే



నేను ఒకటవ తరగతి నుంచి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, ఆరు నుంచి 10వరకు కంబాలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్నా. 2001–08లో పదో తరగతిలో 510 మార్కులు సాధించా. అప్పుడే కొత్తగా ట్రిపుల్ ఐటీలు ప్రారంభించారు. వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో ఇంటర్, బీటెక్ పూర్తయింది. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం వచ్చింది. గత ఐదేళ్లుగా నెరోలాక్ పెయింట్స్‌లో ఇంజనీరుగా పనిచేస్తున్నా. ఇదంతా దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమే.

– కె.లక్ష్మీకాంతరెడ్డి, బోయబొంతిరాళ్ల

భూమి ఉన్నంత వరకు వైఎస్సార్ గుర్తుంటారు



హంద్రీనీవా కాలువ ద్వారా రిజర్వాయర్‌లోకి నీరు వస్తుంది. అక్కడి నుంచి మా గ్రామంలోని పొలాలకు నీరు అందుతుంది. ఒక్కప్పుడు నిత్యం కరువుతో అల్లాడుతున్న సమయంలో వైఎస్సార్ దేవుడిలా వచ్చారు. ఎక్కడో ప్రవహించే కృష్ణజలాలు ఎత్తిపోతల ద్వారా ఈ ప్రాంతానికి తీసుకరావడంతో మంచి పంటలు పండించుకుని అప్పుల నుంచి గట్టెక్కాం. ఈ భూమి ఉన్నంత వరకు వైఎస్సార్ ఇక్కడి ప్రజల గుండెల్లో కొలువై ఉంటారు.

– కురువ నాగరాజు, రైతు, పుట్లూరు

రెండు పంటలు పండిస్తున్నాం



సిద్దాపురం చెరువు కింద రెండు పంటలు పండిస్తున్నాం. ఎత్తిపోతల పథకం మంజూరు కాకపోయుంటే కరువు కాటకాలతో ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం ఎత్తిపోతల పథకంతో సిద్దాపురం చెరువులో పూర్తి స్థాయిలో నీరు ఉంది. ఈ నీటితో రెండో పంటకు కూడా నీరందుతోంది. ఈ పథకం మంజూరు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డిని నిత్యం స్మరించుకుంటున్నాం.

– యేసేబు, ఆత్మకూరు

4 శాతం రిజర్వేషన్‌తో డాక్టర్ అయ్యా



ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌దే. ఈ రిజర్వేషన్ మాలాంటి వారికే ఎంతో ఉపయోగపడింది. వైద్యవిద్యను అభ్యసించేందుకు అవకాశం కలిగింది. కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజీలో (ఎమర్జెన్సీ మెడిసిన్), డీఎన్‌బీ విద్యను బెంగళూరులోని బాప్టిస్ట్ ఆసుపత్రిలో పూర్తి చేశా. మెడిసిన్ విద్యను పూర్తి చేయడంతోనే నా కల సాకారమైంది. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ వంటి వాటితో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు వైఎస్సార్ అప్పట్లో అమలు చేశారు. ఎంతో మంది సామాన్యుల జీవితాల్లో మార్పు వచ్చి ప్రస్తుతం ఉన్నతంగా జీవిస్తున్నారు.

– మహమ్మద్ రఫీ, చాబోలు, నంద్యాల మండలం

కష్టపడిన ప్రతి కార్యకర్తకు తోడుంటాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్ష, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ తదితరులు

కోడుమూరు రూరల్: రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, కష్టపడిన ప్రతి కార్యకర్తలకు అండగా నిలుస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం కోడుమూరులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, కోడుమూరు, గూడూరు, సీ.బెళగల్, కర్నూలు మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల పేరిట సీఎం చంద్రబాబునాయుడు ప్రజలను దారుణంగా మోసం చేశాడన్నారు. హామీలపై ఎవరైనా ప్రశ్నిస్తే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. చంద్రబాబు తనను గెలిపిస్తే గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తానని కోడుమూరు ప్రజలకు హామీ ఇచ్చాడన్నారు. అయితే ఏళ్లు గడిచినా ఆ హామీ ఏమైందో, గుండ్రేవుల ప్రాజెక్టు కోసం పార్టీ మారుతున్నానటూ ఓ నేత మాటలు ఏమయ్యాయో ప్రజలందరికీ తెలుసన్నారు. సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సాగిస్తున్న మోసపు పాలనను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి తెలియజెప్పాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, గూడూరు ఎంపీపీ సునీత, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు లాయర్ ప్రభాకర్, హనుమంతరెడ్డి, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, మగ్బుల్, శివరాముడు, అధికార ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రమేష్‌నాయుడు, మోహన్‌బాబు, రామాంజినేయులు, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

జనసేనాని సమాధానం చెప్పాలి

వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు మాయమయ్యారని ఆరోపించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన ఏడాది పాలనలో ఎంతమంది మహిళల ఆచూకీ కనుగొన్నారో సమాధానం చెప్పాలి. రానున్నది మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే. కూటమి నాయకులు గుర్తుంచుకొని మెలగాలి. వాళ్లు ఏమిస్తున్నారో అంతకు రెట్టింపు చెల్లిస్తాం. – కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్ష

మోసం చేయడమే బాబు నైజం

నమ్మిన వారిని మోసం చేయడమే సీఎం చంద్రబాబు నైజం. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేరిస్తే, కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా హామీలను తుంగలో తొక్కి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. బాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దాం. – నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సతీష్

ప్రశ్నిస్తే దాడులు చేస్తారా

ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రశ్నించే వారిపై పోలీసుల చేత దాడులు చేయించడం దారుణం. కూటమి ప్రభుత్వ పాలనలో కర్నూలు మండలంలోని గ్రామాల్లో అరాచక పాలన సాగుతోంది. ఇది ఎంతకాలం చెల్లుబాటు కాదు. వచ్చేది జగనన్న ప్రభుత్వమే. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలి.

– మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ

స్కీంల పేరిట స్కాంలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి మహిళలను దారుణంగా మోసగిస్తోంది. మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ, పంపిణీ పేరిట రూ.150కోట్లకుపైగా స్కాం చేశారు. హోంమంత్రిగా మహిళ ఉన్నప్పటికీ రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు అధికమయ్యాయి.

– వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ

అర్జీలు రీఓపెన్ కానివ్వొద్దు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిష్కారమైన సమస్యల ఫీడ్ బ్యాక్‌పై ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని సరిదిద్దుకోవాలన్నారు. కర్నూలు డీఐ వద్ద 22, పత్తికొండ ఆర్‌డీఓ దగ్గర 19, కర్నూలు ఆర్‌డీఓ దగ్గర 15, ఆదోని సబ్‌కలెక్టర్ దగ్గర 15 కేసులు రీఓపెన్ అయినట్లు చెప్పారు. వీటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సీఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ దగ్గర 10, పత్తికొండ ఆర్‌డీఓ దగ్గర 3, కలెక్టరేట్ ఏఓ దగ్గర 3, ఉద్యాన శాఖ, సర్వే ఏడీ, జిల్లా రిజిస్ట్రార్, డీపీఓల దగ్గర ఒక్కో అర్జీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు.

10 రోజుల్లో బీఎల్‌ఓలను నియమించండి

ప్రస్తుతం ఎన్నికల అంశాలకు సంబంధించి పనిచేసే బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్‌ఓలు) బదిలీ కావడంతో వారి స్థానాల్లో పది రోజుల్లో కొత్త వారిని నియమించాలని నియోజకవర్గాల ఈఆర్‌ఓలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిఫార్స్ ఉన్న వారికేనా?



ఎరువుల పర్మిట్లను చూపుతున్న రైతులు

ఎమ్మిగనూరురూరల్: యూరియా పుష్కలంగా ఉందంటూ అధికారులు ఒక వైపు చెపుతున్నా రైతులు మాత్రం ఎరువుల బస్తాల కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. సోమవారం ఉదయం నుంచి డీసీఎంఎస్ వద్ద ఎరువుల కోసం క్యూలో నిల్చున్నా యూరియా అందకపోవటంతో సొసైటీ అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. రైతులకు కాకుండా ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పీఏ చెప్పిన వారికి, పోలీసులు, ఇతర నాయకులు చెప్పిన వారికే ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వరకు వేచి ఉన్నా ఇవ్వకుండా రేపు రమ్మంటున్నారని, అలాంటప్పుడు పర్మిట్లు ఎందుకు ఇవ్వాలని సొసైటీ అధికారులను ప్రశ్నించారు. సాయంత్రం యూరియా లోడ్ రావటంతో వాగ్వాదానికి దిగిన రైతులకు పంపిణీ మాత్రమే పంపిణీ చేయడంతో రైతులు శాంతించారు.

ఎరువుల వివరాలు నమోదు చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): రసాయన ఎరువుల అమ్మకాల పూర్తి వివరాలను డీలర్లు ఎప్పటికప్పుడు ఈ-పాస్ మిషన్లతో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అవసరమైనన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అవసరం ఉన్నంతవరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలన్నారు. డీఏపీ స్థానంలో మిశ్రమ ఎరువులు(ఎన్పీకే) 20-20-0-13, 16-20-0-13, 28-28-0, 14-35-14 ఎరువులను వినియోగించవచ్చన్నారు. జూలై నెలకు సంబంధించి 25,080 టన్నుల ఎరువులు రావాల్సి ఉందని, ఇప్పటి వరకు 2,801 టన్నులు వచ్చాయని తెలిపారు. రానున్న 3-4 రోజుల్లో యూరియా 1,896 టన్నులు రానుందని, కోరమాండల్ యూరియా 1,306, ఆర్సీఎఫ్ యూరియా 590 టన్నులు వస్తుందన్నారు.

విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని రిషిత(16) మృతదేహానికి సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించటంతో వారు తమ స్వగ్రామానికి అంత్యక్రియల నిమిత్తం తీసుకెళ్లారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వీబీఆర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

వెలుగోడు: వెలుగోడు తెలుగుగంగ జలాశయంలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి 5,500 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రస్తుత జలశాయంలో 251.94 మీటర్ల వద్ద 826.573 2.260 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలుగుగంగ ఏఈఈ శివనాయక్ తెలిపారు.

15 నుంచి కేసీకి నీటి విడుదల

- హెచ్ఎన్ఎస్ఎస్ కింద 33 చెరువులకు నీటి సరఫరా
- ఐఏబీ సమావేశంలో తీర్మానించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఐఏబీ సమావేశానికి మంత్రి టీజీ డుమ్మా!



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా. చిత్రంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, పార్థసారథి, బొగ్గుల దస్తగిరి

కర్నూలు(సెంట్రల్): ఈనెల 15 నుంచి కేసీ కెనాల్ కింద 3,763 ఎకరాకల ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నీటి పారుదల సలహా మండలి(ఐఏబీ) సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ డుమ్మా కొట్టగా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పాణ్యం, ఆదోని, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, పార్థసారథి, బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఎల్సీ కింద ఆయకట్టుకు జూలై 18న సాగునీటిని విడుదల చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. హంద్రీనీవా నుంచి కల్లూరు మండలం నాయకల్లు, కోడుమూరు మండలం లద్దగిరి గ్రామాల వద్ద రెండు స్లూయిజ్‌లను ఏర్పాటు చేయాలని తీర్మానాలు ప్రభుత్వానికి పంపుతున్నామన్నారు. హంద్రీనీవా కాలువ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెంచుతూ చేపడుతున్న విస్తరణ పనులను పూర్తిచేసి జూలై 15 నుంచి నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అదే రోజే గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి కూడా నీటిని విడుదల చేయాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ కింద 33 చెరువులను పూర్తిగా నింపాలని నిర్ణయించామన్నారు. చెరువుల్లో పూడిక తీత కోసం ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మైనర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని వ్యవసాధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, హంద్రీనీవా ఎస్ఈ పాండురంగయ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్, మైనర్ ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

- హంద్రీనీవా నుంచి 77 చెరువులను ఎప్పటిలోగా నింపుతారని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రశ్నించగా.. విస్తరణ పనులు పూర్తయిన వెంటనే నింపడానికి చర్యలు తీసుకుంటామని హంద్రీనీవా అధికారులు వివరణ ఇచ్చారు.
- బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మరమ్మతులను వెంటనే చేపట్టాలని, గాజులదిన్నె ప్రాజెక్టును ముందుగానే నింపాలని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అధికారులను ఆదేశించారు.
- గుండ్రేవుల ప్రాజెక్టు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. హంద్రీనీవా నుంచి నీటిని విడుదల చేయగానే గాజులదిన్నె ప్రాజెక్టును నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకల్లు, లద్దగిరి గ్రామాల వద్ద రెండు స్లూయిజ్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.
- ఆదోని సబ్ డివిజన్‌లో మైనర్ ఇరిగేషన్ శాఖకు సంబంధించి 4 ఏఈ, ఒక్క డీఈ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రతిపాదనలు పంపడానికి ఇబ్బందిగా ఉందని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ బి.పార్థసారథి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు కలెక్టర్ స్పందించి డీఈ, ఏఈలను నియమించాలని ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డిని ఆదేశించారు. ఆదోనికి నీటిని సరఫరా చేసే బసాపురం చెరువు మరమ్మతుల కోసం రూ.33 కోట్లతో ప్రతిపానలు పంపినట్లు కలెక్టర్ చెప్పారు.
- కేసీ కెనాల్, గాజులదిన్నె ప్రాజెక్టులకు నీరు ఎప్పుడిస్తారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రశ్నించారు. గుండ్రేవుల కోసం తీర్మానం చేయాలని సూచించారు. అన్యాకాంత్రమైన బి.తాండ్రపాడు గంగమ్మ చెరువును కాపాడాలని కలెక్టర్‌ను కోరారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు
- పీజీఆర్ఎస్‌కు 85 ఫిర్యాదులు



సమస్యలు చెప్పకుంటున్న అర్జీదారులు

కర్నూలు: కర్నూలులోని ఒక పాఠశాలలో టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలుకు చెందిన లక్ష్మయ్య రూ.6 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు తిలక్ నగర్‌కు చెందిన యువరాజు, బెంగళూరు ఇన్ఫో టెక్నాలజీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అనంతపురానికి చెందిన బాబు రూ.2 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు ముజఫర్ నగర్‌కు చెందిన అభిలాష్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 85 ఫిర్యాదులు రగా చట్ట పరిధిలో విచారించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్‌తో ఆస్తి మొత్తాన్ని కాజేయడానికి ఒక వ్యక్తి ప్రయత్నం చేస్తున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కర్నూలు కుమ్మరి వీధికి చెందిన రాకేష్ ఫిర్యాదు చేశారు.
- నంద్యాల ఆటో నగర్‌కు చెందిన కురువ ఈరన్న ధరణి ఆటో గ్యారేజీలో పనిచేస్తూ ట్రాక్టర్ ఇంజిన్‌కు నెలకు రూ.20 వేలు బాడుగ ఇస్తానని తీసుకెళ్లి 8 నెలలు అయిందని, ఎక్కడికి వెళ్లిపోయాడో ఇంతవరకు తెలియడం లేదని, ఫైనాన్స్ ఆఫీస్ వారు కంతులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన రామాంజనేయులు, మల్లప్ప ఫిర్యాదు చేశారు.
- ఎకరా 20 సెంట్ల తన పొలాన్ని సర్వేయర్ కొలతలు వేసినా కూడా ఉగాది జయన్న అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ప్యాలకుర్తికి చెందిన పెరుగు నగేష్ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు వడ్డెగేరికి చెందిన ఖాజా ఖాన్ గ్లాస్ వర్క్ పనిచేస్తున్నాడని, ఇన్‌స్టాగామ్‌లో తన భర్త పేరుతో నకిలీ ఐడీ సృష్టించి ప్రముఖులను దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కర్నూలుకు చెందిన ఫసియా ఫిర్యాదు చేశారు.

వీడిన శేషన్న హత్య కేసు మిస్టరీ

- వివాహేతర సంబంధం అనుమానంతో...
- హత్య చేసినట్లు దర్యాప్తులో తేల్చిన పోలీసులు



హత్య కేసు నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు: కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కురువ శేషన్న (62) హత్య కేసు మిస్టరీ వీడింది. కురువ శేషన్న తన కూతురు శకుంతల ఇంట్లో పడుకుని ఉండగా ఈనెల 1న రాత్రి అదే గ్రామానికి చెందిన కురువ ఎల్లయ్య అలియాస్ తెల్లన్న కుమారులు కురువ పరశురాముడు, కురువ విజయ్ కుమార్, కురువ గోవిందు, కురువ బీసన్నలు కలిసి ఇంట్లోకి చొరబడి కొడవళ్లు, కర్రలతో దాడి చేసి హత్య చేశారు. శేషన్న కుడి కాలిని నరికి బైకులో తీసుకుని ఊరంతా తిరుగుతూ భయోత్పాతం సృష్టించారని హతుని కూతురు శకుంతల ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా కర్నూలు శివారులోని వెంగన్న బావి వద్ద శివాలయం వెనుక నిందితులు ఉన్నట్లు పక్కా సమాచారంతో ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. నేరానికి ఉపయోగించిన కత్తులు, బైకులను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఎదుట హాజరుపరిచారు. తాలూకా సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి సోమవారం డీఎస్పీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. నిందితుల్లో ఒకరైన పరశురాముడి భార్యతో శేషన్నకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు విచారణలో తేలిందని డీఎస్పీ వివరించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే పోలీసులకు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలి తప్ప శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

బదిలీల్లో సిఫార్సులకే పెద్దపీట

- జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట వీఏఏల బైఠాయింపు



జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో బైఠాయించిన వీఏఏలు

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీలు అడ్డుగోలుగా జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏకపక్షంగా జరుగుతున్న బదిలీలను నిరసిస్తూ వీఏఏలు జిల్లా వ్యవసాయ అధికారి చాంబరు ఎదుట బైఠాయించారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ఉద్దేశించిన జీఓను వ్యవసాయ అధికారులు పరిగణలోకి తీసుకున్న దాఖలాలే లేకపోవడం పట్ల సర్వత్రా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వెలువడిన ఉత్తర్వుల్లో గత ఏడాది నవంబరు మాసంలో మరణించిన వీఏఏను దేవనకొండ మండలం తెర్నెకల్‌కు పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. కొన్ని నెలల క్రితం మరణించిన వీఏఏ ఎపుడు ఆప్షన్ ఇచ్చారో.. ఎలా బదిలీ చేశారో వ్యవసాయ యంత్రాంగానికే తెలియాలి. సిపారసు లేఖలు లేకపోతే ఆదోని, హాళహర్వి, కౌతాళం, పెద్దకడబూరు, హొళగుంద, ఆలూరు, కోసిగి మండలాలకు పంపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎస్టీకి చెందిన శివనాయక్ ఇంతవరకు నంద్యాల జిల్లాలో పనిచేశారు. సీనియార్టీ జాబితాలో ఈయన పేరు 136, ర్యాంకు 4. ఈయనకు కౌన్సెలింగ్ ప్రకారం కర్నూలు పరిసర మండలాలు దక్కాలి. కానీ ఆలూరు మండలానికి పంపారు. సీనియారిటీ జాబితాలో 150పైన ఉన్న వారికి దగ్గరి మండలాలు దక్కాయి. కారణం సిపారసు లేఖలు తెచ్చుకోవడమేనని తెలుస్తోంది. నంద్యాల జిల్లాలో పనిచేసిన నాగహర్షిత గర్భిణి. ఈమెను ఆదోని మండలం మంత్రికి గ్రామానికి బదిలీ చేశారు. ఇలా వందల మంది వీఏఏలతో వ్యవసాయ యంత్రాంగం చెలగాటమడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీఏఏలు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో బైఠాయించినప్పటికీ పట్టించుకునే వారు లేకపోవడం గమనార్హం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, ఉపాధ్యక్షుడు రమణకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పీజీ విద్యార్థులకు ఉరితాడుగా మారిన జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలన్నారు. తద్వారా ప్రతి విద్యార్థి పీజీ చేయడానికి వెసులుబాటు వస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులను మెరుగుపరచాలని, విద్యార్థులకు ఇచ్చే కాస్మొటిక్, మెస్ చార్జీలను పెంచాలని కోరారు. విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం వహిస్తే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. నాయకులు మల్లికార్జున, నరేష్, అస్లాంబాషా, కిరణ్, వీరేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల కమిటీలు నియామకం

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, విద్యార్థి విభాగాల జిల్లా స్థాయి కమిటీలను నియమించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు యువజన, విద్యార్థి విభాగాల కమిటీను ఏర్పాటు చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

యువజన విభాగం జిల్లా కమిటీలో..

ఉపాధ్యక్షులుగా బి.నవీన్ (కర్నూలు), సోమశేఖర్‌రెడ్డి (కోడుమూరు), ప్రధాన కార్యదర్శులుగా యం.దేవపాల్ (ఎమ్మిగనూరు), జీఎంఎస్ మధు (పత్తికొండ), ధనుంజయ (ఆలూరు), ఎన్.నాగేంద్ర (మంత్రాలయం), బింగి కరియప్ప (ఆదోని), సి.నాగశివశంకర్ (పాణ్యం), కార్యదర్శులుగా తంగరడోణ ఇమ్రాన్ (ఎమ్మిగనూరు), ఆర్.నరేంద్రనాథ్ రెడ్డి (పత్తికొండ), ప్రకాష్ (ఆలూరు), ఆర్.శివరామ్‌రెడ్డి (మంత్రాలయం), జి.మహేష్ యాదవ్ (కోడుమూరు), డి.కేశవరెడ్డి (ఆదోని), పి.మధుమోహన్ రెడ్డి (పాణ్యం), చందు (కర్నూలు), ప్రభాకర్ నాయుడు (కర్నూలు), కార్యవర్గ సభ్యులుగా ఆర్.వినయ్‌కుమార్ రెడ్డి (ఎమ్మిగనూరు), బి.శంకర్ రెడ్డి (పత్తికొండ), నట్టయ్య, సి.సాయిక్రిష్ణ (ఆలూరు), ఎస్‌కె. అమ్రీష్ (మంత్రాలయం), పులిరాజు (కోడుమూరు), ఎం.మధుసూదన్ రెడ్డి (ఆదోని), జెండా బాబు (పాణ్యం), యు.మౌలాలీ, అనిల్, వి.క్రిష్ణమోహన్ (కర్నూలు) నియమితులయ్యారు.

జిల్లా విద్యార్థి విభాగ కమిటీలో..

ఉపాధ్యక్షులుగా చాకలి మంజునాథ్ (ఆదోని), వై.అంజి (కర్నూలు), ప్రధాన కార్యదర్శులుగా వై.తిమ్మరాజు (పత్తికొండ), సోము (ఆలూరు), బి.ఉపేంద్ర (మంత్రాలయం), యం.చిన్న వీరేష్ (పాణ్యం), పి.ప్రకాష్ రెడ్డి (ఎమ్మిగనూరు), కార్యదర్శులుగా అరికంటి మద్దిలేటి (ఎమ్మిగనూరు), హెచ్.ఇమ్రాన్ (పత్తికొండ), సిద్ద (ఆలూరు), డి.నాగన్న (మంత్రాలయం), రంగన్న (కోడుమూరు), కె. వీరేష్ (ఆదోని), బోయ మహేంద్ర (పాణ్యం), సునీల్ కుమార్ (కర్నూలు), ఎస్.బాషా (కర్నూలు), కార్యవర్గ సభ్యులుగా హుస్సేన్ బాషా (ఎమ్మిగనూరు), ఎ.మధుబాబు (పత్తికొండ), సూర్య, అక్బర్ బాషా (ఆలూరు), నాగేంద్ర (మంత్రాలయం), తిరుమలేష్ (కోడుమూరు), తెలుగు వీరేంద్ర (ఆదోని), కె.మనోజ్ (పాణ్యం), అనిల్ (కర్నూలు) నియమితులయ్యారు.



వెలవెలబోతున్న డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లకు అద్దెకు ఇచ్చిన టీడీపీ నాయకుని షాపింగ్ కాంప్లెక్స్

ఆదిలోనే హంసపాదు!

- టీడీపీ నాయకుడి షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు
- ఇంటర్నెట్ సౌకర్యం లేక ఆగిపోయిన రిజిస్ట్రేషన్లు
- కాంప్లెక్స్‌కు విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో మగ్గుతున్న వెండర్లు, డాక్యుమెంట్ రైటర్లు

డోన్: కూటమి నాయకుల ఒత్తిడి మేరకు ఆఘమేఘాల మీద ప్రజాభిష్టాన్ని లెక్కచేయకుండా పట్టణ నడిబొడ్డున ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కారాలయాన్ని శివారు ప్రాంతంలోని టీడీపీ నాయకుని షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు మార్చడం ఆదిలోనే హంసపాదులా మారింది. గత శుక్రవారం వరకు పోలీసుస్టేషన్ సమీపంలోని పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్థిర, చర ఆస్తుల విక్రయాలు జరిగాయి. ఉన్నతాధికారుల ఒత్తిడి తాళలేక రాత్రికి రాత్రే శివారు ప్రాంతంలోని భవనంలోకి కార్యాలయాన్ని మార్చారు. కానీ భవనానికి ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో మరో మూడు, నాలుగు రోజులు క్రయ, విక్రయాలు బందయ్యే అవకాశాలున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడనుంది. మరోవైపు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ రెండంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన టీడీపీ నాయకులు ఆ షాపులన్నీ స్టాంప్ వెండర్లు, డాక్యుమెంట్ రైటర్లకు అద్దెకు ఇచ్చారు. షాపులకు కూడా ఇంతవరకు విద్యుత్ మీటర్లు బిగించలేదు. దీంతో చీకట్లోనే పనులు చేసుకోవాల్సి వస్తోందని స్టాంప్ వెండర్లు, డాక్యుమెంట రైటర్లు వాపోతున్నారు.



ఇంటర్నెట్ సౌకర్యం లేక మూతపడిన నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కుంటుపడిన గిరిజన విద్య!

- ఆశ్రమ పాఠశాలల్లో 10 మంది టీచర్ల కొరత



తుగ్గలి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమైనా, నేటికీ ఆయా ఆశ్రమ పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయని పరిస్థితి. జిల్లాలోని కర్నూలు (బాలురు), తుగ్గలి (బాలికలు), ఆలూరు (బాలురు) ప్రాంతాల్లో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలల్లో దాదాపు 600 మంది విద్యార్థులు విద్యతో పాటు వసతిని పొందుతున్నారు. అయితే ఈ పాఠశాలల్లో పలు ముఖ్యమైన సబ్జెక్టులను బోధించేందుకు కూడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా వివిధ సబ్జెక్టులకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్, సెకండరీ స్కూల్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, తెలుగు, ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఆయా పాఠశాలల్లో పనిచేసే పలువురు ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్ల జిల్లాలోని మూడు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు

- కర్నూలులో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) టీచర్ మూడు నెలల వరకు మెడికల్ లీవ్‌లో వెళ్లినట్లు తెలిసింది. ఇదే స్కూల్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు సమాచారం.
- తుగ్గలి (రాతన)లో గ్రేడ్-2 హెడ్‌మాస్టర్ పోస్టుతో పాటు తెలుగు, మ్యాథ్స్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదే స్కూల్‌లో నాలుగు ఎస్‌జీటీ శాంక్షన్ పోస్టులు ఉండగా, ప్రస్తుతం ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా, మిగిలిన మూడు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.
- ఆలూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఒక ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

టీచర్లు లేకపోతే చదువులు సాగేదెట్లా



గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ముఖ్యమైన సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించకపోతే విద్యార్థుల చదువులు ఎట్లా సాగుతాయి. గిరిజన విద్యా సంస్థలను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. జిల్లాలోని మూడు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 10 ఉపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలి. ఈ విషయాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం.

– ఆర్.చంద్రప్ప, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఉన్నతాధికారులకు తెలియజేశాం



జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పడిన ఉపాధ్యాయుల కొరతను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో జరగనున్న ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఖాళీగా ఉన్న ఈ పోస్టులు భర్తీ అయ్యే అవకాశాలు లేకపోలేదు. అంతవరకు విద్యాబోధన కుంటుపడకుండా సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపడతాం.

– పి.కొండయ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి

పంచమఠాల్లో విశేష పూజలు



స్వామివారికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాల్లో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాల్లో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాది కాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఘంటామఠంలో బిల్వం మొక్కను నాటారు.